క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద నిత్యాన్నదానం



ఆహార ప్యాకెట్లు అందిస్తున్న బషీరుద్దీన్

గోల్కొండ: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్న రోగుల సహాయకులకు రాత్రిపూట భోజనం అందిస్తున్నామని సంఘ సేవకుడు, గోల్కొండ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బషీరుద్దీన్ అన్నాడు. 315 రోజులుగా నగరంలోని ఆస్పత్రులలో రాత్రిపూట ఆహారం అందిస్తూ వస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ సంవత్సరం పాటు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. కాగా తోటి ఉద్యోగులతో పాటు దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట మహ్మద్ జలాలుద్దీన్ తదితరులున్నారు.

గుడిమల్కాపూర్‌లో రాజకీయ నిశ్శబ్దం

గోల్కొండ: ఎప్పుడూ రాజకీయాలతో సందడిగా ఉండే గుడిమల్కాపూర్ డివిజన్‌లో రాజకీయ నిశ్శబ్దం ఏర్పడింది. సీనియర్ బీజేపీ నాయకుడు, కార్పొరేటర్ దేవర కరుణాకర్ హఠాన్మరణాన్ని ఆయన అనుచరులు, వివిధ పార్టీల నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. అయితే కొందరు రాజకీయ నాయకులు మాత్రం నిశ్శబ్దంగా ఉంటున్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలలోని కొందరు నాయకులు ఉప ఎన్నికలు ఎప్పుడూ ప్రకటిస్తారా అని ఎదురు చూస్తున్నారు.

అభినందనలు



మౌనికను అభినందిస్తున్న వెంకటాచలం

సుల్తాన్‌బజార్: గుడ్ గవర్నెన్స్ డే సందర్భంగా పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన యూత్ పార్లమెంట్ సమావేశంలో ప్రసంగించి దేశ ప్రజలందరినీ ఆకట్టుకున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన గరిపుత్రిక కేతావత్ మౌనిక విద్యాభ్యాసంతో పాటు సివిల్స్ శిక్షణకు అయ్యే ఖర్చును అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) భరిస్తుందని ఏఐబీఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.వెంకటాచలం ప్రకటించారు. కోఠి, బ్యాంక్ స్ట్రీట్‌లోని ఏపీ, తెలంగాణ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన బ్యాంకు ఉద్యోగుల సదస్సులో వెంకటాచలం, ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు కేతావత్ మౌనికను వేదికపైకి ఆహ్వానించి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వెంకటాచలం మాట్లాడుతూ.. గిరిజన అమ్మాయి చిన్న గ్రామం నుంచి పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ప్రసంగించే స్థాయికి ఎదగడం గొప్ప విషయమన్నారు. పేద బాలికల విద్యకు, చదువులో ఉన్న స్థానానికి ఎదగడానికి ఏఐబీఈఏ దేశవ్యాప్తంగా ఆర్థికంగా సహకరిస్తుందని అందులోనే భాగంగా కేతావత్ మౌనికకు విద్యాభ్యాసంతో పాటు సివిల్స్ శిక్షణకు అయ్యే ఖర్చును భరిస్తుందని వెంకటాచలం తెలిపారు.

23 నుంచి మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ మధుకర్ స్వామి, విద్యాభూషణ్ తదితరులు

అబిడ్స్: పేద బడుగు వర్గాల కోసం ఉచితంగా ప్లాస్టిక్ సర్జరీలు చేపడుతామని డీసీపీ మధుకర్ స్వామి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ విద్యాభూషణ్ తెలిపారు. జనవరి 23 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అమెరికన్ డాక్టర్లచే పలు విధాల ప్లాస్టిక్ సర్జరీలు ఉచితంగా నిర్వహిస్తామని వారు వివరించారు. మంగళవారం సీతారామ్‌బాగ్‌లోని ఈశ్వర్ చంద్ర హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరి 18వ తేదీ నుంచి ప్లాస్టిక్ సర్జరీల కోసం రిజిస్ట్రేషన్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అమెరికాలో పేరుగాంచి వైద్యులు డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భవాని ప్రసాద్‌చే ఈ మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ కొనసాగుతుందన్నారు. లక్ష్మీకుమారి, కమల్‌కుమార్, రఘునాథ్‌రెడ్డి, విహారి పాల్గొన్నారు.

నేడు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బషీర్‌బాగ్ పీజీ లా కాలేజీలో 5 సం.ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు నేడు (18న) కళాశాల ఆవరణలో స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయి. బుధవారం ఎల్ఎల్‌బీ కోర్సుకు ఉదయం 10.30 లకు, ఎల్ఎల్ఎం కోర్సుకు సాయంత్రం 5 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఆహ్వానం అందజేస్తున్న ఎస్‌పీహెచ్ డాక్టర్ మల్లేశ్వరీ



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్, ఎస్‌పీహెచ్ఓ, డీసీలు

అబిడ్స్: కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ మల్లేశ్వరీ ఆధ్వర్యంలో కంటివెలుగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఆమె ఆహ్వానం అందజేశారు. అనంతరం రాజాసింగ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కఋస్త్ర ఈనెల 19 నుంచి రహింపురా ప్లే గ్రౌండ్‌లో నిర్వహించే కంటివెలుగులో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ మల్లేశ్వరీ మాట్లాడుతూ.. కంటి వెలుగు పథకం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైనవారందరికీ ఉచిత పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు ఉచితంగా ఇస్తామని వివరించారు. ప్రజలకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పిస్తున్న తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రఫత్ తన్వార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'పై అవగాహన ర్యాలీ..

యాకుత్‌పురా: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ సూచించారు. ఈనెల 19 నుంచి చేపట్టానున్న 'కంటి వెలుగు'ను పురస్కరించుకొని మంగళవారం ఆయన జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ డీసీ అలివేలు మంగాతాయారు, వైద్య విధాన పరిషత్ డబీర్‌పురా క్లస్టర్ ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ ఎంజిలా అలేఫ్రెయిడ్‌లతో కలిసి యాకుత్‌పురాలోని పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ ఎంజిలా అలేఫ్రెయిడ్ మాట్లాడుతూ.. క్లస్టర్ పరిధిలో యాకుత్‌పురా 1, 2, డబీర్‌పురా, అజంపురా, దారుషిఫా యూపీహెచ్‌సీ కేంద్రాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు 9 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అజంపురా జట్‌పట్‌నగర్ కమ్యూనిటీహాల్, డబీర్‌పురా కమ్యూనిటీహాల్, సోంటీపీర్‌దర్గా బషీర్‌తుల్ మదార్స్, దారుషిఫా బాల్‌షెట్టిఖేత్ ప్లేగ్రౌండ్ కమ్యూనిటీహాల్, దారుషిఫా ప్రభుత్వ పాఠశాల, రెయిన్‌బజార్ ఎస్ఆర్టీ కాలనీ, యాకుత్‌పురా అశ్రఫుల్ మదారీస్, కుర్మగూడ ఇండియన్ ఫంక్షన్ హాల్, ఓంనగర్ కమ్యూనిటీహాల్ ప్రాంతాల్లో కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా యూపీహెచ్‌పీ కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అయేషా ముద్దాషీర్, జీహెచ్ఎంసీ ఏఎంహెచ్ఓ డాక్టర్ ఇర్షాద్ ఇక్బాల్, పారామెడికల్ సిబ్బంది గ్లోరీ, అనిత, మధరావేణి, రీనా, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాలికల విద్యకు అధిక ప్రాధాన్యం: సబితా ఇంద్రారెడ్డి



స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం కింగ్ కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో మల్బార్‌గోల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ప్రతిభ కలిగిన విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేజీ నుంచి పీజీ వరకు అందరికీ ఉచిత విద్యను అందించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. గతంలో తల్లిదండ్రులు బాలికల విద్యకు సరైన ప్రోత్సాహాన్ని ఇవ్వకపోయేవారని, కానీ నేడు ఆ ఆలోచనల్లో మార్పు వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాలికల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువస్తుందని తెలిపారు. ప్రైవేటు సంస్థలు విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లను అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం 1907 మంది విద్యార్థినులకు రూ.8 వేల నుంచి రూ.10 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత, గడ్డి అన్నారం ట్రేడర్స్ అసోసియేషన్ చైర్మన్ తులసి శ్రీనివాస్, మల్బార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు రాకేష్, రజయ్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



డీఈఓ రోహిణికి శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యాశాఖ ఉద్యోగులు

గన్‌ఫౌండ్రీ: టీఎన్జీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం నగర అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు డీఈఓ రోహిణికి మంగళవారం సంక్రాంతి శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా డీఈఓ రోహిణి మాట్లాడుతూ.. ఈ కొత్త సంవత్సరంలో అందరికీ విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం నగర కార్యదర్శి భాస్కర్, సభ్యులు జయంతిరెడ్డి, ప్రియదేవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సకల కళల నిలయం



సన్మాన గ్రహీతలతో పలువురు వక్తలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రం సకల కళల సమ్మేళనమని పలువురు ప్రముఖులు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీరాగరమ్య సాంస్కృతిక, సామాజిక సంస్థ 4వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాహేమంతం పేరిట సకల కళల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్య అవధాని డాక్టర్ శంకర్‌నారాయణ మాట్లాడుతూ.. వివిధ కళారూపాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపిరెడ్డి, సీనియర్ పాత్రికేయులు ఆర్.దిలీప్‌రెడ్డి, కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత కళాకృష్ణ, సంస్థ అధ్యక్షురాలు రమ్య పాల్గొన్నారు.

గోల్కొండలో డ్రగ్స్‌పై అవగాహన

గోల్కొండ: మాదక ద్రవ్యాలు ప్రాణాలు హరించడమే కాకుండా వాటిని సేవించే వారు సమాజంలో గౌరవాన్ని కోల్పోతారని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. గోల్కొండ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గోల్కొండలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎప్పుడూ నిఘా ఉంచాలన్నారు. అంతేకాకుండా డ్రగ్స్ అమ్మే వారి గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని ఆయన అన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ కలిసి కట్టుగా డ్రగ్స్‌పై పోలీసులు చేపట్టిన నో డ్రగ్స్ క్యాంపెయిన్‌కు తమ పూర్తి సహాయ సాహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఎస్సైలతో పాటు పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఇలియాస్ అక్బర అలీ, ఆబిద్, షాన్నవాజ్ ఖాన్ పాల్గొన్నారు.

సంగీత దర్శకుడు కోటికి స్వర్ణ కంకణం బహూకరణ



సంగీత దర్శకుడు కోటికి పురస్కారాన్ని అందజేస్తున్న కేవీ.రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: డాక్టర్ సి.నారాయణరెడ్డి తెలుగు జాతి ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. మంగళవారం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వంశీ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత దర్శకుడు కోటికి సినారే-ఆళ్ల స్వర్ణ కంకణం బహూకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి తరం నుంచి నేటి తరం వరకు ప్రతిఒక్కరూ సినారే పాటలను ఎంతగానో అభిమానిస్తారని కొనియాడారు. ఆరోజుల్లో సినారే పాట లేకుండా సినిమాలు ఉండేవి కాదన్నారు. అంతకు ముందు నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు కోదండ రామిరెడ్డి బి.గోపాల్, రేలంగి నర్సింహారావు, డాక్టర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తానా పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్, నిర్వాహకులు వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

లిబర్టీ: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం ఆయన బీసీ దళ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ నెల 31వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న క్రమంలో బీసీ బిల్లును ప్రవేశపెట్టి బీజేపీ ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని బీసీల పట్ల ఉన్న ప్రేమను నిరూపించుకోవాలన్నారు.

వెటర్నరీ ఆస్పత్రిలో సౌకర్యాలేవీ ?

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రిలో సరైన మందులు, నిర్వహణ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రాజేంద్రనగర్ డివిజన్ మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆరోపించారు. మంగళవారం వెటర్నరీ ఆస్పత్రి వద్ద సిద్దిపేట నుంచి వచ్చిన వారితో కలిసి విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేటకు చెందిన మల్లేష్ తన పెంపుడు పిల్లిని తీసుకువచ్చారన్నారు. ఇక్కడ వైద్యం ఉచితమని వచ్చాడని, వివిధ పరీక్షలు, మందుల పేరిట రూ.13 వేల రూపాయలు ఖర్చు చేయించారన్నారు. అలాగే కరీంనగర్‌కు చెందిన లక్ష్మికి కూడా వేలాది రూపాయలు మందులకే అవుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గ మజ్లిస్ పార్టీ ఇన్‌చార్జ్ రహమత్‌బేగ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి తీసుకువెళ్లి ఆందోళన చేయిస్తామని వారు పేర్కొన్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని విద్యుత్ ఉద్యోగులు నినదించారు. తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్సీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, సాయిబాబు, సహాయ కార్యదర్శి దేవేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం.. గిఫ్ట్ షాప్ దగ్ధం

హిమాయత్‌నగర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో దాదాపు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు తెలిసింది. సోమవారం అర్ధరాత్రి నారాయణగూడ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. వివరాలు... దోమలగూడలో నివాసం ఉండే లక్ష్మణ్‌లాల్ గత పదేళ్లుగా హిమాయత్‌నగర్ వైజంక్షన్ సమీపంలోని టీవీఎస్ షోరూం వద్ద ఉన్న ఫుట్‌పాత్‌పై గిఫ్ట్ షాప్ నెలకొల్పి సీజనల్ పండుగలకు సంబంధించిన పలు రకాల వస్తువులను విక్రయిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి దాటక దట్టమైన పొగలు వ్యాపించి మంటలు మొదలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే లోపల ఉన్న సుమారు రూ.2 లక్షల విలువ చేసే వస్తువులు కాలి బూడిదైనట్టు ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

క్రీడాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



సన్మాన కార్యక్రమంలో హోం మంత్రి మహమూద్ అలీ, డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: క్రీడాకారుల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. బాక్సింగ్ చాంపియన్ మహ్మద్ ముస్సాముద్దీన్‌ను హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు, సేవారత్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో నగదు, మెమొంటోను అందజేసి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి ముస్సాముద్దీన్‌ను సత్కరించి అభినందించారు. క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. సేవారత్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ.. తాను ఉద్యోగులతో పాటు క్రీడాకారుల సంక్షేమానికి కూడా అండగా నిలిచి ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, రాజ్‌కుమార్, ఉమార్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, శంకర్, ఖురేషి, శ్రీధర్, వహీద్, అబ్దుల్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

24న సుబాన్‌పురా బస్తీ దవాఖానా ప్రారంభం



మంత్రి తలసానిని కలిసిన బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

అబిడ్స్: ఈనెల 24న జాంబాగ్‌లోని సుబాన్‌పురాలో బస్తీ దవాఖానా ప్రారంభిస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంత్రిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్థానిక ప్రజల సౌకర్యార్థం ఆనంద్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి మేరకు ఈ బస్తీ దవాఖానా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా హిందీనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధికి మంత్రి తలసాని అండగా ఉండి ఎంతో సహకారం అందిస్తున్నారన్నారు. కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, షేక్ జహంగీర్, సాజీద్ అహ్మద్ అన్సారీ, యుసఫ్, సలీం, నిజాం సాద్, సయ్యద్ అంజాద్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని, వీరికి కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి శస్త్ర చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేని అటువంటి వారు శస్త్ర చికిత్సల కోసం ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయితే పథకానికి దరఖాస్తు చేసుకునే వారు ముందుగా దరఖాస్తుతో పాటు జతచేయాల్సిన పత్రాల గురించి తెలుసుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం ద్వారా నిరుపేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయబడుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ప్రతినిత్యం శానిటైజేషన్



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న డాక్టర్ మజహర్ ఉల్లా తదితరులు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ప్రధాన విభాగాలను ప్రతినిత్యం శానిటైజేషన్ చేస్తున్నామని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో జరుగుతున్న శానిటైజ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో జరిగే ఆపరేషన్లను చాలా జాగ్రత్తగా చేస్తామన్నారు. ఆపరేషన్ కంటే ముందు వైద్య పరికరాలను పూర్తిగా శానిటైజ్ చేస్తామని ఆయన అన్నారు. అంతేకాకుండా ఆస్పత్రి లేబర్ రూం కూడా పూర్తిగా శానిటైజ్ చేస్తామని తెలిపారు. డాక్టర్లు అన్ని జాగ్రత్తలు తీసుకుంటారని, డాక్టర్స్‌తో పాటు ఆపరేషన్ చేసే డాక్టర్స్ సైతం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఖాజా రవుఫ్ ఉద్దీన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్య ఎస్. నాయర్, థియేటర్ ఇన్‌చార్జి డాక్టర్ అమీర్, డాక్టర్ కవిత, డాక్టర్ రవికుమార్ తదితరులున్నారు.

తప్పిపోయిన ముగ్గురు చిన్నారుల అప్పగింత



పిల్లలను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

సంతోష్‌నగర్: తప్పిపోయి రోడ్డుపై తిరుగుతున్న ముగ్గురు చిన్నారులను కంచన్‌బాగ్ పోలీసులు మంగళవారం క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిసల్‌బండ ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ముగ్గురు చిన్నారులు హుస్సేన్, ముస్తాఫా, మూసా రోడ్డుపై తిరుగుతున్నారు. దీన్ని గమనించిన స్థానికులు కంచన్‌బాగ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ముగ్గురు చిన్నారులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం పిల్లల ఆచూకీ కోసం వెతకగా రియాసత్‌నగర్, హఫీజ్‌బాబానగర్‌కు చెందిన పిల్లలుగా గుర్తించారు. దీంతో ముగ్గురు పిల్లలను తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు.

శాతం చెరువు.. అభివృద్ధి కరువు



గోల్కొండ: అధికారుల ఉదాసీన వైఖరికి గోల్కొండ కోట నయాఖిలాలోని శాతం చెరువు నిదర్శనంగా నిలిచింది. పదేళ్లుగా ఈ చెరువును అధికారులు అభివృద్ధి చేస్తామంటూ హామీలు ఇస్తున్నారు. బల్దియా కమిషనర్‌లు ఎందరో ఇప్పటి వరకు ఈ చెరువును సందర్శించే వెళ్లారే తప్పా సుందరీకరణకు మాత్రం చర్యలు తూతూ మంత్రంగా తీసుకుంటున్నారు. కాగా ఈ చెరువు కట్టను ఆనుకుని మార్నింగ్ వాకర్స్ కోసం దారిని కూడా ఏర్పాటు చేసి దానికి ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. అయితే చెరువు కట్ట పొడవునా టన్నుల కొద్ది వ్యర్థాల డంపింగ్ కారణంగా వేసిన కంచె పూర్తిగా ధ్వంసమైంది. మరోవైపు ఎన్నో మార్లు చెరువులో పూడికతీత పనులు చేపట్టారు. షరా మామూలే అన్నట్లు పూడికతీసిన కొన్ని రోజుల్లోనే మళ్లీ గుర్రపు డెక్క చెరువులో వ్యాపిస్తుండేది. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ గత సంవత్సరం చెరువు అభివృద్ధిపై అధికారులను నిలదీయడమే కాకుండా బల్దియా కమిషనర్‌తోపాటు ఇతర శాఖల అధికారులను చెరువు దగ్గరకు రప్పించి, చెరువు దుస్థితిని అధికారులకు వివరించారు. అయితే అధికారులు మాత్రం చెరువులోని గుర్రపు డెక్కలను తొలగించి ఊరకుండిపోయారు. ఈ చెరువును అభివృద్ధి చేసిచుట్టూ గ్రీనరీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.